# షేక్ జఫ్రీన్

## జ్యూరీ స్పెషల్ రికగ్నిషన్ అవార్డు - మహిళ

షేక్ జఫ్రీన్ ! చిన్నతనంలోనే టెన్నిస్ ఆటపై మక్కువ పెంచుకుంది. కూతురి అభిరుచి గుర్తించిన తండ్రి షేక్ జహీర్ అహ్మద్ జఫ్రీన్‌ను ప్రోత్సహించాడు. కూతురిని ఒక మంచి క్రీడాకారిణిగా తీర్చిదిద్దేందుకు ఆయన తన సర్వస్వం త్యాగం చేశారు. నిరంతర శిక్షణ, టోర్నమెంట్లలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా టూర్లు, ఇతర ఖర్చుల కోసం ఆస్తి మొత్తం అమ్మేశారు. తండ్రీ కూతుళ్లు ఇద్దరూ కలిసి తమ లక్ష్యం దిశగా అంతులేని విశ్వాసంతో పయనించారు.

ఈ ప్రయాణంలో ఎన్నెన్నో ఆటుపోట్లు, అడ్డంకులు. ఆడపిల్లకు ఆటలెందుకని సూటిపోటి మాటలు. అయినాసరే... కూతురు మీద...ఆమె ఎంచుకున్న టెన్నిస్ మీద నమ్మకం కోల్పోలేదు జహీర్ అహ్మద్. తండ్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా జఫ్రీన్ తన ఆటతీరుతో కొద్దికొద్దిగా గుర్తింపు తెచ్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నెంట్లలో పాల్గొనే అవకాశాలు రావడం ప్రారంభమైంది. కానీ అప్పటికే జఫ్రీన్ ఆట కోసం తండ్రి తనకున్నదంతా ఖర్చుచేసేశారు. సొంత ఇంటిని కూడా అమ్మకానికి పెట్టారు. ఇక అమ్మడానికి ఏమీ లేని పరిస్థితి. ఇలాంటి సిట్యుయేషన్‌లో జఫ్రీన్ పట్టుదలతో సాధన చేసింది. అల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ టోర్నమెంట్లలో పాల్గొని అత్యుత్తమ ర్యాంక్ సాధించినప్పటికీ స్పాన్సర్స్ ఎవరూ ముందుకు రాలేదు. అయినా తండ్రి కూతుళ్లు ఆటను విడిచిపెట్టలేదు. 2013 లో బల్గేరియాలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో ఇండియన్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించింది జఫ్రీన్. ఆ తరువాత నుంచి జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో రాకెట్‌లా దూసుకుపోయింది.

2017 లో జరిగిన డెఫ్లింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి తన తండ్రి కల నెరవేర్చింది. అసలు విషయం ఏమిటంటే జఫ్రీన్‌కు వినిపించదు. మాటలు కూడా రావు. అయినా ఇది ఆమెలోని ఆత్మవిశ్వాసాన్ని ఏమాత్రం దెబ్బతీయలేకపోయాయి. షేక్ జఫ్రీన్‌కు జ్యూరీ స్పెషల్ రికగ్నిషన్ - ఫిమేల్  కేటగరీలో సాక్షి ఎక్సలెన్స్ అవార్డు అందజేస్తోంది సాక్షి మీడియా.